ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 28 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

28-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	25


వరద పనులపై.. అలసత్వం

- మాన్‌సూన్‌యాక్షన్ ప్లాన్ శూన్యం
- వేసవి వచ్చినా పుర పాలకులు చోద్యం
- మున్సిపాల్టీల్లో పూడిపోయిన వరద నీటి కాల్వలు
- భారీ వర్షం కురిస్తే మున్సిపాల్టీలో కాలనీలు మునకే

వర్షాలతో వరద.. ఇళ్లు మునకతో మున్సిపాల్టీల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ నీరు పోయే మార్గాలు లేక ఎక్కడికక్కడ కాలనీలు మునిగిపోతున్నాయి. ప్రజలకు వరద కష్టాలు తప్పించేందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాల్సిన పుర పాలకులు చోద్యం చూస్తున్నారు. వర్షాలతో ముంపు సమయాల్లో హడావుడి చేయడానికే మున్సిపల్ అధికా రులు, పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారే కానీ ముందస్తు చర్యలపై శ్రద్ధ చూపడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ కేంద్రాల్లోని కాల్వలు జమ్ము, వ్యర్థాలు, తూటికాడలతో నిండి ఉంటున్నాయి. దీంతో ఓ మోస్తరు వర్షం పడినా ఆ నీరు పోయే మార్గాలు లేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. రోజుల తరబడి ఆ ప్రాంతాల్లోని నివాసితులు నీటి మధ్య అల్లాడుతున్నారు. అదే వేసవిలో డ్రెయిన్లలో పూడిక తీస్తే వర్షపు నీరు సాఫీగా పారుదలై ప్రజలకు ముంపు కష్టాలు లేకుండా ఉంటాయి. అయితే వర్షాకాల ముందస్తు ప్రణాళిక, పనులపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. వేసవిలో చేయాల్సిన పనులను వర్షాల సమయంలో చేస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

పనులు.. ఇలా చేయాలి

మున్సిపాల్టీల్లో పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించి వరద నీరు సులువుగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాల్వల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీసి నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగించాలి. కాల్వల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. వర్షాకాల ముందస్తు పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో ఆయా పనులు చేయాలి. కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లో మురుగు, వరదనీటి కాల్వలు పూడికతో నిండిపోయి.. ఓ వర్షాలకే పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో వర్షాలు వస్తున్నాయంటే ప్రజలు వణికిపోతున్నారు. వాస్తవానికి మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు నిరంతరం కొనసాగిస్తుండాలి. ప్రస్తుత వేసవి కాలం పూడికతీత పనులకు అనువైన వాతావరణం. అయితే ఆయా పనులపై పురపాలకులు ప్రణాళికలతో ముందుకు వెళ్లడంలేదు. సమస్య వచ్చినపుడు మాత్రమే నిద్ర మేల్కొనడం అలవాటుగా మార్చుకున్నారన్న విమర్శలున్నాయి. వర్షాలు కురిసే ముందు హడావుడిగా పనులు చేపడుతున్నారు. దీని వల్ల ఫలితం లేకపోగా పాలకులు, కాంట్రాక్టర్లకు జేబులు నిండుతున్నాయి. వర్షాకాలంలో పనులు కంటికి కనిపించవు.. ఖర్చుల లెక్కతేలదు.. దీంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రతి మున్సిపాల్టీలో వేసవి ప్రణాళికను అమలు చేయాలి. వర్షాకాలంలో ప్రజలకు మురుగు.. వరద నీటి ఇబ్బందులు లేని విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో కాల్వలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. ఇప్పటికైనా ముంపు నివారణలో భాగంగా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. ఈ దిశగా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసే విషయంలో పురపాలకులు మొద్దు నిద్ర వీడటం లేదు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాల్వల్లో పూడిక తీత పనులు, పగిలిన కట్టడాల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఇంకా సమాయత్తం కాకపోవటం గమనార్హం. వరదల సమయంలో ముంపునకు గురయ్యే గృహాల వారికి సాయం అందించే కన్నా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఏటా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వరద కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాదైనా ప్రజలను ముంపు కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



వరద నీటి మునకలో నరసరావుపేట (పాత చిత్రం)

మొక్కుబడిగా మమ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు వర్షాకాల ముందస్తు ప్రణాళికను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘాల్లో చిన్న, పెద్ద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని భావించింది. గత జూలైలో పూడిక తీతకు నిధులు మంజూరు చేసింది. కొన్ని మున్సిపాల్టీల్లో ఈ పనులు మొక్కుబడిగా నిర్వహించారు. మరి కొన్ని మున్సిపాల్టీలు మమ అనిపించాయి. కేవలం నిధులు ఖర్చు చూపించాలన్న ఉద్దేశంతోనే పనులు చేపట్టారే కానీ ముంపు సమస్య పరిష్కరించాలన్న ఉద్దేశం లేదన్న విమర్శలు వచ్చాయి.



నరసరావుపేటలో జమ్ము, వ్యర్థాలతో పూడి పోయిన ప్రధాన వరద నీటి కాల్వలు

కబ్జాలో కాల్వలు

జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్లతో పాటు మూడు జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాల్లో వరద నీటి కాల్వలు చాలావరకు ఆక్రమణల పాలయ్యాయి. కాల్వలపైనే కొందరు నిర్మాణాలు చేపట్టారు. పూడిక తీయడానికి వీలు లేకుండా కబ్జా చేసేశారు. కాల్వలపై ఆక్రమణలతో వర్షపు నీరు పోయే మార్గాలు లేకపోయినా వాటి తొలగింపునకు కనీస ప్రయత్నాలు జరగడంలేదు. మున్సిపల్ రికార్డుల్లో నమోదైన ప్రకారం కాల్వల విస్తీర్ణం లేదు. కాల్వలను మాయం చేసేలా నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే రోడ్లు చెరువులను మరిపిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి.

ఉగ్రదాడులపై ముస్లింల నిరసన




ఉగ్ర దాడికి నిరసనగా పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఆదివారం పిడుగురాళ్ల పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెద్ద మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్దసంఖ్యలో ముస్లింలు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేశారు. మత సామరస్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముక్తి మౌలానా మహ్మద్ మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతానికి సంబంధం లేదని ఖురాన్‌లో ఉందన్నారు. హిందూ ముస్లింలు ఐక్యంగా ఉండి హిందువులపై జరిగిన దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, దూదేకుల ఖాశిం, కరీమ్, ముజీబ్, ఆరిఫ్, అబ్దుల్లా, ఖాదర్‌వలి, అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో మట్కా

- జోరుగా క్రికెట్ బెట్టింగ్‌లు
- ప్రధాన సూత్రదారిగా చికోటి సత్తి
- గోవా, దుబాయి ట్రిప్పులతో యువతకు ఎర
- వైసీపీ హయాం నుంచి కొనసాగుతున్న హవా



మాచర్లటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లతో యువత పెడదారి పడుతోంది. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు మొదలైనప్పటి నుంచి మాచర్లకి చెం దిన చికోటి సత్తిగా పేరుపొందిన ఓ వ్యాపారి క్రికెట్ బెట్టింగ్‌ల్లో మునిగి తేలుతున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిచయాలు, వ్యాపార మూలాలతో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లతో కోట్లకు పడగలెత్తాడు. రోజుకు రూ.కోటి పైనే ఆడుతుంటాడని సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ప్రారంభమైన ఇతడి ప్రభంజనం నేటికీ కొనసాగుతూనే ఉంది. క్యాసినో, గ్యాంబ్లర్‌గా ఆరితేరిన ఈ సత్తి అనేక రకాల పందాలతో పాటు గోవా, దుబాయి ట్రిప్పులు, ప్రీమియం రూమ్స్, మద్యం, విందులతో యువతను ఆకర్షిస్తున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు డిపాజిట్ చేయించుకుంటాడు. ఇలా ఒక్కో ట్రిప్పునతో రూ.30 లక్షల నుంచి 60 లక్షల వరకు వెనకేసుకుంటున్నాడని సమాచారం. ఓ వ్యక్తి పెట్టుబడిదారిగా ఉండగా తన కింద ఓ వ్యక్తితో మట్కాలు నిర్వహిస్తుంటాడు. స్లిప్పులు రాసేందుకు ముగ్గుర్ని నియమించుకుని పట్టణంలో బురుజు, రవిస్వీట్స్, పార్కు, కొలిముల కూడళ్లలో పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్నాడు. ఆటకు రూ.10 వేలు పెడితే రూ.లక్ష వస్తాయని ఆకర్షించి జూదరుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఈ గేమ్‌లో ఇప్పటి వరకు పోగొట్టుకోవడమే తప్ప సంపాదించిన దాఖలాలు లేవు. చిన్న చిన్న వ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే గుమ్మస్తాలు, టీస్టాల్స్‌లో పనిచేసే యువత, విద్యార్థులు వీరి బారిన పడి అప్పులపాలై నానా తంటాలు పడుతున్నారు. మట్కా, బెట్టింగ్‌ల్లో డబ్బులు పోగొట్టుకొని వ్యసనాలకు బానిసలై బైకు దొంగతనాలకు కూడా పాల్పడుతున్నారు. గతంలో ఓ వ్యక్తిని పోలీసులు జిల్లా బహిష్కరించినా తిరిగి మళ్లీ మాచర్లలో మట్కా, బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు.

క్రికెట్ ప్రధాన బుకీగా..

ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ పోటీలు సాగుతున్నాయి. ఈ క్రమంలో క్రికెట్ ప్రధాన బుకీగా కొనసాగుతూ తనకింద వందల మంది చోటా బుకీలను ఏర్పాటు చేసుకుని మాచర్ల కేంద్రంగా బెట్టింగ్ నడుపుతున్నాడు. నేషనల్ ఎక్స్ఛేంజ్ యాప్ ఆధీనంలో బెట్టింగులను కొనసాగిస్తున్నాడని సమాచారం. మాచర్లలో నలుగుర్ని పెట్టుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు.

పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే..

మాచర్ల నియోజకవర్గంలో బెట్టింగ్ జోరుగా నిర్వహించడాన్ని పోలీసులు సవాల్‌గా తీసుకుని బుకీలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బెట్టింగ్‌లు, మట్కాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కదల్లేని వారికి కార్డులెలా?



సీనియర్ సిటిజన్ కార్డు

- వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డుల కష్టాలు
- సచివాలయాలకు వెళ్తేనే ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది
- ఇంటి వద్దనే కార్డు మంజూరు చేయాలంటున్న వృద్ధులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డులను పొందలేని పరిస్థితి పలువురు వృద్ధుల్లో నెలకొన్నది. కార్డు కోసం సచివాలయాలకు వెళ్లాల్సి రావడమే ఇందుకు కారణం. వృద్ధుల్లో కొందరు అనారోగ్య సమస్యల దృష్ట్యా నడవలేని వాళ్లు ఉన్నారు. వారు కార్డు కోసం సచివాలయానికి వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. అసలే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల సమయం దాటిన తర్వాత వృద్ధులు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. ఒకవేళ ఎక్కడికైనా బయటకు వెళ్లి వస్తే వడదెబ్బ బారిన పడుతు న్నారు. గుంటూరు జిల్లాలో 85 ఏళ్ల వయస్సు పైబడి వృద్ధులు దాదాపుగా 17 వేల మంది ఉన్నారు. ఇక బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోనూ వేల సంఖ్యలో వృద్ధులు ఉన్నారు. గ్రామాలు, కొన్ని పట్టణాల్లో సుదూరంగా సచివాలయాలు ఉన్నాయి. అక్కడ వరకు ఎండల్లో వెళ్లలేక.. కార్డులు పొందలేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల వరకు సిబ్బంది రావడంలేదు.. ఆ తర్వాత కూడా రకరకాల పనులు, ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఎండలో అంతదూరం వెళ్లలేక.. వెళ్లినా గంటల తరబడి నిరీక్షించలేక పోతున్నారు.ఈ పరిస్థితుల్లో సచివాలయాలకు వెళ్లి సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను సిబ్బంది మంజూరు చేస్తున్నారు. ఎవరైతే 60 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూపు, ఆధార్ లింక్ మొబైల్ నంబరు తీసుకుని వచ్చిన వారికి దరఖాస్తు ఇచ్చి దానిని పూర్తి చేయించి సచివాలయాల సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దాంతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతున్నది. ఆ కార్డులో వృద్ధుడు/వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, మాస్క్‌డ్ ఆధార్ నంబరు, సీనియర్ సిటిజన్ కార్డు నంబరు, బార్ కోడ్, చిరునామా, కాంటాక్టు నంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైలు నంబరు, ఎమర్జెన్సీ నంబర్లు పొందుపరిచి ఉంటున్నాయి. ఈ సీనియర్ సిటిజన్ కార్డులు పలు విధాలుగా వృద్ధులకు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కార్డుతో పలు ప్రయోజనాలు..

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయి. వృద్ధాప్య పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఇందుకు కారణంగా ఈ కార్డులోనే పుట్టిన తేదీ నమోదై ఉంటుంది. అలానే ఆధార్ నంబరు కూడా ఉంటుంది. మిగతా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలన్నా ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టిక్కెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకుల్లో వృద్ధులకు ప్రత్యేకించి అధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ల స్కీమ్‌లకి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆస్పత్రుల్లోనూ సీనియర్ సిటిజన్ కార్డు ఉపయోగపడుతుంది. రైల్వే టిక్కెట్ కౌంటర్లలో త్వరితగతిన టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లుగా సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

దిక్సూచి
DIKSUCHI

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

□ మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? ఎంత వరకు చదువుకున్నారు?

జ: మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూరులో, ఆరు నుంచి పది వరకు కాగజ్‌నగర్ నవోదయ, తరవాత త్రిచిలోని ట్రిబుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. నాన్నపేరు గోవింద్‌జాదవ్, హెడ్ కానిస్టేబుల్. అమ్మ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అక్క శృతి, వైద్యురాలు.

□ సివిల్స్‌లో మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? ఈ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలు పెట్టారు?

జ: 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఆ తరవాత డిల్లీకి వెళ్లి ఒక సంవత్సరం కోచింగ్ తీసుకుందాం అనుకున్నాను. అయితే కొవిడ్ ఎఫెక్ట్‌తో మధ్యలోనే వదిలేసి వచ్చేశాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేదు. 2020, 2021లో మళ్లీ రాశాను. అయితే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా, కాని మెయిన్స్ దాటలేదు. 2022లో ఇంటర్వ్యూకు వెళ్లాను. కానీ ర్యాంకు రాలేదు. మళ్లీ 2023లో మెయిన్స్ దశ దాటలేక పోయాను. అయితే అదే సంవత్సరం 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్' వచ్చింది. ఆరో ప్రయత్నంలో 2024లో విజయం సాధించాను. నా ర్యాంకుకు ఐఏఎస్ రావచ్చు.

□ మొదటి సారి విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు....?

జ: సివిల్స్ పరీక్షలు రాసిన ప్రతీసారి నాలో కొంత ఇంప్రూమెంట్ కనిపించింది. అదే ప్రధాన కారణం. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. దీంతో ఏదో వస్తుందన్న ఆశ పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు స్నేహితులు మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.

ప్రతి అటెంప్ట్‌లో ఇంప్రూవ్‌మెంట్



సాయి చైతన్య జాదవ్
68వ ర్యాంకు

□ రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: ఎన్ని గంటలు ప్రిపేర్ అనేది కాదు కాని ఎంత చదివితే అర్థమవుతుందో అంత వరకే చదివే వాడిని. పరీక్షలు దగ్గర పడినప్పుడు మాత్రం రోజుకు 10 నుంచి 13 గంటలు చదివే వాడిని. ఎన్ని గంటలు చదివాము అన్నది కాకుండా, ఎంత అర్థం చేసుకో గలిగాం అన్నది ముఖ్యం.

□ సివిల్స్ రాయాలంటే కోచింగ్ తప్పని సరా?

జ: నా ఉద్దేశ్యంలో కోచింగ్ అవసరం లేదు. ఒకరిని చూసి మరొకరు కోచింగ్‌కు వెళుతున్నారు. ఏదో కొంత తప్ప, గత కోచింగ్ ప్రస్తుతం ఉపయోగపడతుందన్న గ్యారెంటి లేదు. స్నేహితులను చూసి నేను కూడా కోచింగ్‌కి వెళ్లాను. కాని మధ్యలోనే వచ్చేశాను. ఐదేళ్లుగా సొంతంగానే సిద్ధం అయ్యాను. కాకపోతే స్నేహితులతో కలిసి మాక్ ఇంటర్వ్యూలు చేయడం జరిగింది.

□ జనరల్ స్టడీస్‌కు, అలాగే ఆప్షనల్‌కు ఏ మెటీరియల్ చదివారు....?

జ: రోజు న్యూస్ పేపర్ చదవడంతో మన చుట్టు పక్కల ఏం జరుగుతుందనే విషయంపై అవగాహన వస్తుంది. ఇది ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా అన్ని స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రకమైన ప్రామాణిక బుక్స్ అవసరం. ఉదాహరణకు నా ఆప్షన్ ఆంత్రోపాలజీ. మొదటి నుంచి దీనితోనే సివిల్స్ రాస్తున్నాను. మొదట్లో ఒక నెల రోజులు కోచింగ్ వెళ్లినా అంతగా అర్థం కాలేదు. మొదటి సారి మెయిన్స్ రాక పోవడంతో ఎక్కువ సమయం దొరికింది. దాంతో సొంతగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను.

□ సివిల్స్‌లో మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది...? ఎంత సేపు జరిగింది. ఎలాంటి ప్రశ్నలు అడిగారు?

జ: నన్ను రాజ్‌శుక్లా సర్ బోర్డు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. ఆరోజు నాలుగో వ్యక్తిని. ఇంటర్వ్యూ అప్లికేషన్ ఫాంలో మొత్తం 22 సర్వీస్‌లను పేర్కొనాల్సి ఉండగా నేను ఐఏఎస్, ఐపీఎస్ రెండు సర్వీస్‌లను మాత్రమే పెట్టాను. ఇంటర్వ్యూలో దీనిపై అడిగారు. నాకు ఆల్ రెడీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ సంబంధించిన 'ఐఎఫ్ఎస్' సర్వీస్ ఉందని చెప్పాను. ఏపీ నుంచి విడిపోయిన తరవాత తెలంగాణలో అభివృద్ధి ఎలా ఉంది. అలాగే కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందా? అని అడిగారు. నా సొంత జిల్లా ఆదిలాబాద్ కాబట్టి అడవుల గురించి అడిగారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఆదిలాబాద్ గిరిజన తెగల గురించి ప్రశ్నించారు. మా నాన్న పోలీసు కాబట్టి ఆ డిపార్ట్‌మెంట్ గురించి కూడా అడిగారు.

ఎం. రాజేశ్వర్, అదిలాబాద్

విష్ణుమూర్తి అవతారాలేమిటి?

సివిల్స్ ప్రిపరేషన్ అంటేనే సుదీర్ఘ ప్రయాణం. ఇందులో ఎన్ని ఆటుపోటులు వచ్చినా చివరి వరకు పట్టు విడవకూడదు. అలా విజేతగా నిలిచిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన బాన్న వెంకటేష్. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో తన ప్రిపరేషన్ ఎలా సాగింది, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడిగారో 'దిక్సూచి' పాఠకులతో ఆయన పంచుకున్నారు.



బాన్న వెంకటేష్
15వ ర్యాంకు

□ సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించినందుకు అభినందనలు.. మీ కుటుంబ నేపథ్యం చెప్పండి.. ఏమి చదువుకున్నారు..?

జ: థాంక్యూ. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామం. తొమ్మిదో తరగతి వరకు శ్రీకాకుళంలో, ఇంటర్‌మీడియట్ విశాఖపట్టణంలో.. బీటెక్ తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లిలో పూర్తిచేశాను. నాన్న చంద్రరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ రోహిణి గృహిణి. మా తమ్ముడు వంశీ 'ఇస్రో'లో సైంటిస్ట్.

□ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? సివిల్స్ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలుపెట్టారు?

జ: బీటెక్ తర్వాత నెలకు రూ. 1.5 లక్షలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. కానీ సంతృప్తి లేదు. ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పాజిటివ్‌గా ఆలోచించాను. జాబ్‌కు రిజైన్ చేసి 2021 అక్టోబరు నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను.

□ ఈ ప్రయాణంలో తొలుత విఫలం అయినప్పుడు ఎలా మోటివేట్ చేసుకున్నారు?

జ: 2022లో తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా దాటలేదు. కానీ డీమోటివేట్ కాకుండా సిలబస్ కంప్లీట్ చేసుకుంటూ రెండో దఫా పరీక్షకు బాగా సిద్ధం అయ్యాను. 2023లో 467 ర్యాంకు వచ్చింది. ఆంధ్ర కేడర్ ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ పోలీస్ అకడామీలో ఉన్నా. 2024లో ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను.

□ ఇంత మంచి ర్యాంకు వస్తుందని ఊహించారా?

జ: నేను వంద నుంచి 150లోపు ర్యాంకు వస్తుందని ఊహించాను. 15వ ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావాలనుకున్నాను. అదే వచ్చింది.

□ రోజుకి ఇన్ని గంటలు తప్పనిసరిగా చదవాలనే నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: సివిల్స్ అంటే చదువు విషయంలో ప్లానింగ్ ఉండాలి. రోజుకి ఎనిమిది గంటలు కచ్చితంగా చదివా. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే అయ్యేది.

□ సివిల్స్ లాంటి అత్యున్నత లక్ష్యం పెట్టుకున్నవారు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా? ఒకవేళ మీరు కోచింగ్ తీసుకుంటే అది ఎలా ఉపయోగపడింది?

జ: ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. మాక్ టెస్టులు రాశాను. బాగా ప్రిపేర్ అయ్యాను. రెండో అటెంప్ట్‌కు ఐపీఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో ఐఏఎస్.

□ జనరల్ స్టడీస్‌కు మెటీరియల్ ఏమి చదివారు? అలాగే ఆప్షనల్‌కు ఏమి మెటీరియల్ చదివారు?

జ: అందరి ప్రిపరేషన్‌లాగానే నాదీ జరిగింది. ఆప్షనల్‌గా 'జాగ్రఫీ' ఎంచుకున్నాను.

□ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది? మొత్తం ఎంత సేపు జరిగింది? ఇంటర్వ్యూలో మిమ్మల్ని ఎలాలంటి ప్రశ్నలు అడిగారు? ఏమైనా గుర్తున్నాయా?

జ: లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా సర్ బోర్డు అరగంటకు పైగా నన్ను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుతం ఐపీఎస్‌లో ఉన్నావుగా.. మరెందుకు ఐఏఎస్‌కు రావాలనుకుంటున్నావు..? అనే ప్రశ్న వేశారు. అలాగే ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి కొన్ని అంశాలపై ప్రశ్నలు వేశారు. మీ జిల్లాకు మీరు కలెక్టర్ అయితే అక్కడ ఉన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు అని కూడా అడిగారు.

□ మీకు అత్యంత కఠినం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అని భావించిన ప్రశ్న ఏమైనా ఉందా?

జ: ఎలక్ట్రానిక్స్‌లో కొన్ని అంశాలపైనా, టెక్నాలజీ గురించి కొన్ని డీటెయిల్డ్‌గా చెప్పమన్నారు. నాకు ఎంతవరకు తెలుసో అంతవరకే చెప్పాను. తెలియని అంశంపై సైలెంట్‌గానే ఉన్నా.

□ అతి సులువు ప్రశ్నగా దేనిని భావించారు?

జ: మీ పేరు 'వెంకటేష్' కదా.. ఆ పేరుకున్న అర్థం ఏమిటి అని అడిగారు. పాపాలను హరించేవాడని.. విష్ణు అవతారంలో ఒకరైన శ్రీ వెంకటేశ్వరుని పేరు అది అని చెప్పాను. అయితే విష్ణు అవతారాలలో నాలుగు చెప్పండి అని అడిగితే నాలుగు అవతారాలను చెప్పేశాను.

□ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మిమ్మల్ని అడిగిన ప్రశ్నలు ఏవి?

జ: తెలంగాణ గురించి అడగలేదుకానీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో సువిశాలమైన తీరప్రాంతముంది కదా.. ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చు... అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమస్యలు.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో ఉన్న సమస్యలు గురించి అడిగారు. క్షుణ్ణంగా వివరించాను.

తాతపూడి సురేష్‌బాబు, శ్రీకాకుళం

రాజంపేటపై అడిగారు?

కలలు కనడం కాదు.. వాటిని సాకారం చేసుకోవాలనే అబ్దుల్ కలామ్ మాటలు అతనిలో స్ఫూర్తి నింపాయి. బీటెక్‌లో సీనియర్స్ ఎక్కువ మంది సివిల్స్‌వైపు వెళ్లడంతో తాను ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నారు కడపకు చెందిన శివ గణేష్ రెడ్డి. అందుకు అనుగుణంగా ప్రయత్నించి విజయం సాధించారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా మూడో ప్రయత్నంలో ఎలా విజయం సాధించారో వివరించారు.



చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి
119వ ర్యాంకు

□ కుటుంబ నేపథ్యం ఏమిటి. ఎంత వరకు చదువుకున్నారు?

జ: మధ్యతరగతి కుటుంబం మాది. సొంత ఊరు కడప పట్టణం అలంకానపల్లె. పదో తరగతి వరకు కడప, ఇంటర్మీడియట్ నెల్లూరులో, తరవాత హైదరాబాద్ ఐఐటిలో బీటెక్ పూర్తి చేశాను. ఐఐటిలో చదివే సమయంలో ఎక్కువ మంది సీనియర్లు సివిల్స్‌కు ఎంపిక అయ్యారు. దీంతో నేను ఎందుకు పరీక్ష రాయకూడదూ అనే ఆలోచన వచ్చింది. దానికి అనుగుణంగా ముందుకు సాగాను. నాన్న మల్లికార్జునరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫ్యాకల్టీగా చేశారు. ప్రస్తుతం వ్యవసాయం చూసుకుంటున్నారు. అమ్మ ఇందిరా ప్రియదర్శిని గృహిణి. చెల్లెలు శివ జ్యోతిక ప్రస్తుతం మాస్టర్స్‌కు ప్రిపేర్ అవుతోంది.

□ ప్రస్తుతం ఏ సర్వీసు వస్తుందని అంచనా వేస్తున్నారు...?

జ: సివిల్స్‌లో నా ర్యాంకు 119. ఐఏఎస్ వస్తుందని అనుకుంటున్నాను. ఏ సర్వీసు వచ్చినా పర్వాలేదు.

□ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది. రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా.....?

జ: సివిల్స్‌లో విజయం సాధించాలంటే ముఖ్యంగా సామాజిక, వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా దిన పత్రికలు చదవాలి. ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలోనే మెయిన్స్ అంశాలపై నిశిత దృష్టి సారించాలి. నా విషయానికి వస్తే రోజుకు 6 నుంచి 7 గంటల సేపు చదివాను. ఇంజినీరింగ్ పూర్తి కాగానే 2020లో కోచింగ్‌లో చేరాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కొన్ని పోర్టల్స్ అందుబాటులో ఉన్నాయి. మెయిన్స్‌కు ఎలా సిద్ధమవ్వాలి. అక్కడ ఏయే అంశాలపై ప్రశ్నలు వస్తాయో తెలుపుతూ ఆర్టికల్స్ ఇస్తారు. రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నామన్నది కాదు ఆయా అంశాలను ఎలా అకళింపు చేసుకున్నామన్నదే కీలకం. క్రమశిక్షణగా ముందుకు సాగితే ఎంపికవడం సులభం.

□ సివిల్స్‌కు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా?

జ: నా దృష్టిలో కోచింగ్ ఉంటే మంచిది. ప్రిపరేషన్ త్వరలో గాడిలో పడుతుంది. నేను 2020 లో బీటెక్ పూర్తయిన వెంటనే ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లాను. కరోనా నేపథ్యంలో రెండేళ్ల గ్యాప్ వచ్చింది. తర్వాత రెండుసార్లు సివిల్స్ రాసినప్పటికీ ఫలితం రాలేదు. మూడో అటెంప్ట్‌లో జాతీయస్థాయిలో 119వ ర్యాంక్ వచ్చింది.

□ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది?

జ: ఛైర్మన్ ప్రీతి సుగం మేడమ్ నేతృత్వంలో ఇంటర్వ్యూ అర్ధగంట సేపు సాగింది. మనం ఇచ్చే డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో ఉన్న అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు.

□ ఇంటర్వ్యూలో కఠినమైన ప్రశ్నలు లేదా ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?

జ: కడప జిల్లాలో రాజంపేట సంబంధించి చెప్పమని ప్రశ్నించగా ఒక్కసారి ఆశ్చర్యపోయా. ఊహించని ప్రశ్న. అయినా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. అలాగే కడప జిల్లాలో మహిళల సమస్యలు, వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించారు వాటికి కూడా సమాధానం చెప్పడం జరిగింది.

విలియం జాన్ కళ్యాణ, ఎడ్యుకేషన్ రిపోర్టర్, కడప

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పది కాలాల పాటు గుర్తుండే సినిమా

ప్రియదర్శి కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'సారంగపాణి జాతకం' పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమా. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కుటుంబ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. మా సినిమాను సూపర్ హిట్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశాం. ప్రతి ఒక్కరు ఈ వేసవిలో మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' ఓ వరంలా దొరికింది' అనిప్రియదర్శి అన్నారు.





అంచనాలను మించి అలరిస్తుంది

ఎస్ఎస్ రాజమౌళి

"నేను తీసే మహాభారతంలో నాని పోషించేది ఏ పాత్ర అనేది చెప్పను గానీ.. అందులో ఆయన కచ్చితంగా ఉంటాడు. నిర్మాత ప్రశాంతిని హిట్ మెషీన్ అని పిలుస్తుంటాం. 'హిట్ 3' కూడా ఆమెకు ఘనవిజయాన్ని అందిస్తుంది. ఈ 'హిట్ ఫ్రాంచైజీకి అంతం లేదు. నాని తీసే ప్రతి సినిమాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. ఈ సినిమా అంచనాలను మించి అలరిస్తుంది. ఆయన ఇప్పటికే అందనంత ఎత్తుకు ఎదిగారు. మరింత గొప్ప స్థాయికి ఎదగాలి. ఈ సినిమాకు సూపర్‌హిట్ పక్కా అనే వైబ్ కనిపిస్తోంది" అని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. మే 1న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఇందులో హింస మీరు భయపడేలా కాదు, ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఒక మంచి థ్రిల్లర్‌కు పక్కా కమర్షియల్ సినిమా జతకలిస్తే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ఒకప్పుడు రాజమౌళిగారు నా సినిమాలు చూసి ఎలా ఉందో చెప్పేవారు. కానీ ఆ సంప్రదాయం ఈ మధ్య మిస్సయ్యింది. ఈ సినిమాను మాత్రం ఆయన మొదటి రోజు చూస్తారని ఆశిస్తున్నాను. లేదంటే ఆయన పాస్‌పోర్ట్ లాగేసుకుంటా. ఆయన పేరు ఇప్పటికే సినిమా డిక్షనరీలోకి వెళ్లిపోయింది. రోమాలు నిక్కబొడుచుకునే ఏ సన్నివేశానికైనా రిఫరెన్స్ కావాలంటే.. 'రాజమౌళి ఎపిసోడ్' అని అనడం అలవాటు అయిపోయింది. ఈ సినిమాలోనూ ఒక అద్భుత సన్నివేశం ఉంటుంది. దాన్ని నేను, శైలేష్ 'రాజమౌళి మూమెంట్' అని పిలుస్తుంటాం. విష్వక్ సేన్, అడివి శేష్ ఈ 'హిట్ యూనివర్స్'కు మూలస్తంభాలు. శైలేష్ కొలను ఎంతటి ప్రతిభావంతుడో సినిమా విడుదల రోజున మీకందరికీ తెలుస్తుంది. సినిమా బాగుండాలి. సినిమాను కాపాడుకుందాం. ఈ గురువారం మనకు సినిమా అంటే ఎంత ప్రేమ ఉందో దేశానికి చూపిద్దాం. 'హిట్ 3' మీ అంచనాలను అందుకోకుంటే 'ఎస్ఎస్ఎమ్‌బీ29'ని చూడొద్దండి. ఈ సినిమాతో పాటు విడుదలవుతున్న 'రెట్రో', 'రైడ్ 2' చిత్రాలూ బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. "హిట్ ఫ్రాంచైజీకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇదో న్యూ ఏజ్ సినిమా" అని హీరో విష్వక్ సేన్ అన్నారు. "ఈ సినిమా చివరి 30 నిమిషాలు చూశాను. చాలా బాగుంది. ఆరంభ వసూళ్లు అదరిపోతాయి" అని అడివి శేష్ తెలిపారు. "సినిమా అంటే నానిగారికి అపారమైన ప్రేమ. నన్ను ఇంతగా నమ్మిన ఆయనకు కృతజ్ఞుడ్ని" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు. "నానిగారితో నటించడం ఒక మరిచిపోలేని అనుభూతి" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి తెలిపారు.

త్రీడీ వెర్షన్‌లో



చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలైంది. ఈ బ్లాక్‌బస్టర్ విడుదలై 35 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్రీడీ వెర్షన్‌లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

క్రిమినల్ కథేంటి?



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన తమిళ చిత్రం 'రకాదన్'. వంశీకృష్ణ, రియాజ్‌ఖాన్, దినేశ్ ప్రధాన తారాగణం. దినేశ్ కలై దర్శకుడు. కే హైమావతి నిర్మించారు. ఇప్పుడు ఈ చిత్రం 'క్రిమినల్ 123' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజేఆర్ పిక్చర్స్ పతాకంపై రామకృష్ణ, కిశోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మే తొలివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: మానస్‌బాబు.



ప్రత్యేక పాత్రలో సమంత



నటి సమంత తన సొంత బ్యానర్ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆదివారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. గ్రామంలోని మహిళలంతా టీవీలో సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తిస్తుంటారు. వారి నుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా ప్రత్యేక పాత్రలో సమంత ప్రత్యక్షమవుతారు. హాస్యం, హారర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్‌ని చూస్తే తెలుస్తోంది.

డ్రగ్స్ కేసులో మలయాళ దర్శకుల అరెస్టు





ఇటీవలె మలయాళ నటుడు షైన్ టామ్‌చాకోను డ్రగ్స్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. 'నేనొక్కడినే కాదు, మలయాళ పరిశ్రమలో చాలా మంది మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారు' అని ఆయన చేసిన వాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా, మలయాళ పరిశ్రమకు చెందిన ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 'జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహ్మాన్, 'తమాషా' ఫేమ్ అష్రఫ్ హంజాలతో పాటు వారి స్నేహితుడు షలీఫ్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొచ్చిలోని ఓ అపార్టుమెంటులో సోదాలు నిర్వహించిన పోలీసులు వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వారు ముగ్గురూ కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

గ్రామీణ ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఆదివారం షూటింగ్ మొదలైంది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో టీఏ స్టార్ మూవీ మేకర్స్ పతాకంపై తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. గౌతమ్ రవిరావు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విపిన్ వి రావు.

చదువుతోనే అసమానతలు లేని సమాజం

● యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్‌కల్యాణ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చదువుతో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని యూపీఎస్సీలో 146 ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజన సేవా సమితి ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాన్ని మెరుగుపరుచు కోవాలని సూచించారు.


చల్లా పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న కమ్మజన సేవా సమితి సభ్యులు

కష్టపడి గాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పవన్ కల్యాణ్ తండ్రి రమేష్ మాట్లాడుతూ తమది మధ్యతరగతి కుటుంబమని, పట్టుదలతో చదివి ఈ స్థాయికు తన కొడుకు చేరుకున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. కుమార్తె సుచరిత కూడా చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోందని తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్‌లే దేశాన్ని నడిపిస్తున్నారని అటువంటి కీలక బాధ్యతలు తీసుకుంటున్న పవన్‌కల్యాణ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులు కోటా వంశీ, సమితి గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి కల్యాణ్ కృషిని కొనియాడారు. అనంతరం చల్లా పవన్ కల్యాణ్, తల్లిదండ్రులను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

❖ ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడిన కారు

బాపట్లరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కారుని వేగంగా నడపడంతో.. అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. బాపట్ల మండలం రామ్‌నగర్‌కు చెందిన దండప్రోలు కృపాకర్ (30), బాపట్ల పట్టణానికి చెందిన అశోక్ అనే ఇద్దరు మద్యం సేవించారు. కృపాకర్‌ను రామ్‌నగర్‌లో దించేందుకు ఇద్దరూ కారులో వెళ్తుండగా ముత్తాయపాలెం గ్రామ సమీప మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో కృపాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీవ్రగాయాల పాలైన అశోక్‌ను తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం చీరాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉంది. బాపట్లరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హరిలో రంగ హరి నాటికలోని ఓ సన్నివేశం


ఉక్కు సంకెళ్లు నాటికలోని ఓ సన్నివేశం

ప్రేక్షకులను అబ్బురపరిచిన నాటికలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. మండల పరిధిలోని పల్లెకోనలో ఆదివారం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వెలగలేరు థియేటర్స్ ఆధ్వర్యంలో హరిలో రంగహరి నాటకాన్ని తొలుత ప్రదర్శించారు. సమాజంలో అందరి జీవితాలు ఒకేలా ఉండవు. ఒకరి ఇష్టాలు ఇంకొకరి పిచ్చిలా, చాదస్తంగా అనిపిస్తాయని.. ప్రస్తుత కాలంలో సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆదరించే వారిని అదో రకంగా చూడడం మామూలు అయిపోయిందని, తాత తండ్రుల నుండి వంశపారంపర్యంగా వస్తున్న హరిదాసు వృత్తిని కొనసాగించాలని కోటేష్ అనే వ్యక్తి ఎదురైన అడ్డంకులు, అవమానాలు తట్టుకుని ఎలా అధిగమించాడనే ఇతివృత్తంతో ఈ నాటిక కొనసాగింది. పూలదాసు శ్రీనివాసరావు దర్శకత్వంలో నటీనటులు సురభి రాఘవ, సాయిదీపిక, ఫరూక్, స్వరూప్ మిరియాల, పవన్‌కల్యాణ్, శ్రీనివాసరావు, కొండలరావు, సురభి లలిత, గట్టు రవి తదితరులు పోషించిన పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండవది ఉక్కు సంకెళ్లు నాటిక ప్రదర్శించారు. మత్స్యకారుల చేపల వేట వృత్తాంతంతో సాగిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఉప్పులూరి సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో సింహప్రసాద్ రచించారు. అనంతరం కావూరి సత్యనారాయణ రచించగా ఈపూరి హరిబాబు దర్శకత్వంలో చిరు మేఘం నాటిక ప్రదర్శించారు. ఈ మూడు నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

రెండు పళ్ల విభాగంలో.. బయ్యారం ఎడ్లజత విజయం


బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా జరిగాయి. జత పళ్ల విభాగంలో 3,553.05 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన కేఎంకే బుల్స్ మణికంఠ ఎడ్ల జత మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో 3,500 అడుగుల దూరం లాగి ప్రకాశం జిల్లా బసినేపల్లి గ్రామానికి చెందిన ఎడ్లకంట్ల వెంకట చైతన్య కుమార్ ఎడ్ల జత, మూడవ స్థానంలో 3,324.05 అడుగులు దూరం లాగి కడప జిల్లా పాలూరు గ్రామం హేమలత బుల్స్ కొణుదల హేమలతారెడ్డి ఎడ్ల జత, నాల్గవ స్థానంలో 3,278.4 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా అబ్బూరు గ్రామానికి నక్కా బల రామకృష్ణ యాదవ్, మాచాయపాలెం గౌరు కార్తికేయ కంబైన్డ్ ఎడ్ల జతలు, ఐదవ స్థానంలో 3,235.06 అడుగులు దూరం లాగి పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కేకేఆర్ బుల్స్ కల్లూరి కార్తీక నాయుడు, భార్గవ్ నాయుడు ఎడ్ల జత, 6వ స్థానంలో 3,195 అడుగుల దూరాన్ని లాగి సూర్యపేట జిల్లా మేళ్ళచెరువు గ్రామం కేకేఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, రెవెల్యూష్ రెడ్డి ఎడ్ల జతలు నిలిచాయి. మొదటి బహుమతికి రూ.20వేలు నగదు బచ్చు జనార్ధన్ జ్ఞాపకార్థం బచ్చు సుధీర్, రెండవ బహుమతి రూ.15వేలు రుద్రాల అచ్చారావు, మునిని శ్రీను, బొడ్డపాటి రామకృష్ణ, మూడవ బహుమతి రూ.10వేలు కె.వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం విష్ణుమూర్తి, అనంత కోటేశ్వరరావు, నాల్గవ బహుమతి రూ.8వేలు కమతం శ్రీనివాసరావు, 5వ బహుమతి రూన6వేలు ఏఎంఆర్ ఎలక్ట్రికల్స్ ఆశం అచ్చిరెడ్డి, 6వ బహుమతి రూ.5వేలు గుదె నిహారిక, నగదుతో పాటు షీల్డ్ ప్రదానం చేశారు.

కల్తీ ఆయిల్ వ్యాపారం.. వైసీపీ నేతపై కేసు నమోదు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నాయకుడు చీదెళ్ల కృష్ణపై నెల్లూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పిడుగురాళ్ల - మాచర్ల రహదారి పక్కనే ఉన్న నూనె మిల్లులో రాష్ట్రంలోని ప్రముఖ బ్రాండ్ల పేరుతో కల్తీ ఆయిల్ తయారు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడన్న అతనిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో నెల్లూరులోని ఓ కంపెనీ నుండి 15 టన్నుల ఆయిల్ ట్యాంకర్ బెంగుళూరుకు కొన్ని రోజుల వరకు వెళ్లకపోవడంపై కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి గురై ఆయిల్ అంతా కిందపోయిందని కట్టుకథలకు పోలీసులు తనదైన శైలిలో విచారించగా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల కృష్ణతో కలిసి కల్తీ వ్యాపారానికి సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో నెల్లూరు పోలీసులు శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల సమీపంలో చీదెళ్ల కృష్ణకు చెందిన ఆయిల్ మిల్లులో సోదాలు నిర్వహించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను అడ్డుపెట్టుకొని అతను కల్తీ నూనె వ్యాపారం పెద్ద ఎత్తున సాగించాడు. ప్రతినెలా పలుశాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి, వైసీపీ నాయకులతో సిఫార్సు చేయించుకోవడంతో సంబంధిత అధికారులు కల్తీ వ్యాపారం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. నెల్లూరు నుండి బెంగుళూరుకు వెళ్లాల్సిన ఆయిల్ ట్యాంకర్‌ను దారిమళ్లించి ఆయిల్‌ను చోరీ చేసిన ఘటనలో చీదెళ్ల కృష్ణ, రవిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేయడంతో పిడుగురాళ్లలో వైసీపీ నేతలు ఉలికిపాటుకు గురయ్యారు. విచారణలో ముడుపులు తీసుకున్నట్లుగా తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని అధికార పార్టీ నేతలు భయపడుతున్నారు. వైసీపీ హయాంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా చీదెళ్ల కృష్ణ సతీమణి రేవతి పనిచేశారు.


ఆయిల్ కల్తీకి స్థావరమైన మిల్లు (ఇన్‌సెట్లో) చీదెళ్ల కృష్ణ, వైసీపీ నాయకుడు

ఉగ్రదాడిలో అమరులకు రైల్వే స్కౌట్స్, గైడ్స్ ఘన నివాళి

● కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్



కొవ్వొత్తుల ర్యాలీలో డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఏడీఆర్ఎం, అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన దేశ పౌరులకు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదాలు చేశారు. ర్యాలీ ముగింపు కార్యక్రమం సందర్భంగా రైల్వేస్టేషన్‌లో అమరులకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.


యువకుడిపై పోక్సో కేసు

పిడుగురాళ్ల ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఉంటున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆదివారం పిడు గురాళ్ల పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. చల్లా అనిల్ కుమార్ అదే ప్రాంతానికి కృష్ణా జిల్లా నుంచి వచ్చి నివాసం ఉంటున్న తల్లికూతుర్లతో పరిచయం పెంచుకున్నాడు. మహిళ పట్టణ పరిధిలో ఓ రెస్టారెంట్‌లో పనికి వెళ్తోంది. ఇంటిలో ఒంటరిగా ఉంటున్న ఆమె 17 ఏళ్ల కూతురుతో కొన్నాళ్లుగా అనిల్‌కుమార్ చనువుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూతురు ఆరోగ్యంలో మార్పులు గమనించిన తల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో అనిల్ కుమార్‌పై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● ముగ్గురూ ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులే.. ● రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాల వారి వీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ విషయాలను అమలాపురంలోని ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. జనవరి 11న అమలాపురంలోని కురసాలవారి వీధిలోని ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు సభ్యుల ముఠా గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడక 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాలగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ఈ ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేదించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.


అమలాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఆ జిల్లా ఎస్పీ కృష్ణారావు

తెలంగాణ నూతన సీఎస్ ఒకప్పటి గుంటూరు కలెక్టరే


కే రామకృష్ణారావు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె.రామకృష్ణారావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ అధికారి అయిన రామకృష్ణా రావు 2004కి ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కలెక్టర్‌గా ఉన్నప్పుడే సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తొలిసారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టారు. ఎన్నికల యంత్రాంగాన్ని సమాయత్తం చేసి ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఆయన తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ రాష్ట్రానికి సీఎస్ కావడంతో అప్పట్లో జిల్లాలో విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులు ఆయనతో కలిసి పని చేసిన రోజులను జ్ఞాపకం చేసుకొంటున్నారు.

పట్టాలపైకి పశువులను తీసుకురావొద్దు

● యజమానులకు రైల్వే రక్షక దళం విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పశువులను రైలు పట్టాల మీదకు తీసుకొచ్చి ప్రయాణికుల భద్రతకు హాని తలపెట్టొద్దని రైల్వే రక్షక దళం, ఇంజనీరింగ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ పశువులను రైలు ఢీ కొడితే అవి చనిపోవడంతో పాటు రైలు పట్టాలు తప్పే ప్రమాదం ఉందని తెలిపారు. అలానే రైలు ఇంజిన్ పాడైపోయే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల రైళ్ల సమయపాలన దెబ్బతింటుందని, అలానే ఎమర్జన్సీ బ్రేకులు వేయడం వల్ల ప్రయాణికులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పశువులను లెవల్ క్రాసింగ్‌ల వద్ద దాటించేటప్పుడు కచ్చితంగా వాటికి రెట్రో రిఫ్లెక్ట్ ప్లేట్స్ అమర్చాలని సూచించారు. అలానే రైలు పట్టాల సమీపంలోకి పశువులను తీసుకురావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌జీపీ పీఎఫ్ ఏఎస్ఐ బి.సుబ్బారావు, పీడబ్ల్యూఐ సాయికృష్ణ, పిడుగురాళ్ల ఎస్ఐపీఎఫ్ తదితరులు పాల్గొన్నారు.


నడికుడి మార్గంలో పశువుల కాపర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రైల్వే అధికారులు

వివాహిత అనుమానాస్పద మృతి


తెడ్ల లక్ష్మి (ఫైల్‌ఫొటో)

వెల్దుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని కేపీగూడెంలో చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన వివాహిత తెడ్ల లక్ష్మి (60) శనివారం సాయంత్రం తన తల్లి ఊరైన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు వెళ్లింది. తాను మాచర్లకు వెళ్తున్నానని చెప్పి రాత్రి ఇంటి నుంచి బయలుదేరింది. ఆదివారం మండలంలోని కేపీగూడెం సమీపంలోని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుస్తులు లేకుండా విగతజీవిగా పడిఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సమందర్‌వలి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించా రు. లక్ష్మి మృతదేహం సగం కాలిపోయి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆత్మహత్య లేక ఏదైనా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో సమస్యాత్మక ప్రాంతంగా ఉన్న ఐతానగర్‌లో రౌడీషీటర్లను అణచివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పుతామని టూటౌన్ సీఐ రాములనాయక్ అన్నారు. ఐతానగర్ అంబేడ్కర్ విగ్రహం రోడ్డులో గత గురువారం పోలీసు కానిస్టేబుల్‌పై ఒక రౌడీ షీటర్, సస్పెక్ట్ షీట్లు ఉన్న ఇద్దరు మరొక యువకుడు కలసి దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాముల నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గతంలో తెనాలిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, అక్రమ మద్యం,


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాముల నాయక్

దొంగతనాలు తదితర కేసుల్లో చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ బాబులాల్, దోమ రాకేష్ నిందితులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పలుమార్లు అప్పటి త్రీటౌన్ ప్రస్తుతం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కన్నా చిరంజీవి నోటీసులు ఇచ్చారని చెప్పారు. అలా ప్రతిసారి పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం నిందితులకు ఇబ్బంది అనిపించి, కానిస్టేబుల్‌ను చంపేందుకు ప్రణాళిక వేశారని వెల్లడించారు. ఇందుకు ఐతానగర్‌కు చెందిన రౌడీ షీటర్ వేము నవీన్ సహాయం తీసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఐతానగర్ వైపు వెళ్తున్న కానిస్టేబుల్ చిరంజీవిపై ఈ నలుగురు నిలువరించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. కానిస్టేబుల్ చిరంజీవి తప్పించుకొని స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ వివరించారు. కేసు నమోదు చేసి, ముగ్గురు నిందుతులను ఐతానగర్ లింగారావు సెంటర్‌లో ఆదివారం అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. ఎస్సై షేక్ సుభాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వేస్ట్ కేబుల్స్ దగ్ధం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ వద్ద వేస్ట్ కేబుల్స్‌లో మంటలు చెలరేగాయి. స్టేషన్ మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దగ్ధమైన కేబుల్స్ విలువ సుమారు రూ.40 వేలు ఉండవచ్చని అధికారులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.50 అడుగులు ఉంది. ఇది 139.43 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పూరిల్లు దగ్ధం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జానపాడు గ్రామంలో వేముల శివలక్ష్మీకి చెందిన పూరిల్లు ఆదివారం అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.4.5లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు పిడుగురాళ్ల అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.



దాచేపల్లి అంకమ్మ గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి

భక్తిభావాన్ని పెంపొందించటమే కొలుపుల లక్ష్యం

దాచేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలోను భక్తిభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంగానే నాటి పెద్దలు కొలుపులను ఏర్పాటుచేశారని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం దాచేపల్లిలో శ్రీ వీర్లంకమ్మ తల్లి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జంగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోను ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చే కూరుతుందన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పు ల గిరి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి నిత్యం రూ.15వేల మందికి పైగా అన్నదానం చేస్తున్నారు. కార్యక్రమంలో నర్రా పుల్లయ్య, మాశెట్టి బుజ్జి, ఐనాల శ్రీరాములు, రుద్రాల అచ్చారావు, తోట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ షరీఫ్, గద్దల వేదమణి, అంబటి శేషగిరిరావు పాల్గొన్నారు.

పంపుహౌస్ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంపుహౌస్ వద్ద వాకింగ్ ట్రాక్‌పై పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, కూటమి నేతలు శంకుస్థాపన చేశారు. వాటర్ ఫౌంటేన్ పనులను పరిశీలించడంతో పాటు విద్యుత్, మరికొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, దేవళ్ల రాంబాబు, కుంచపు గంగరాజు, వల్లెపు రామకృష్ణ, జెమిని రామకృష్ణ, ఫరీద్‌మేస్త్రి, వేముల ఆంజనేయులు, లెక్కల విష్ణు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

లారీపై నుంచి జారిపడి క్లీనర్ మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద సిమెంట్ లోడుతో ఉన్న లారీకి పట్టలు కప్పుతూ ప్రమాదవశాత్తు జారిపడి లారీ క్లీనర్ కారంపూడి వీరనాగిశెట్టి(44) ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య మూడు సంవత్సరాల క్రితమే చనిపోయింది. పాప, బాబు ఉన్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగన్నకుంటలో ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థాన 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పూజారి వేదాంతం రమణాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 బిందెల నీటితో స్వామి వారికి అభిషేక అర్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందులవారిపాలెం గ్రామంలో శ్రీ శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, పోలేరమ్మ తల్లి కొలుపుల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 25.91 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరుద దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

వైభవంగా వసంత వేడుకలు

బెల్లంకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెంలో ఆదివారం పోలేరమ్మ జాతర సందర్భంగా గ్రామస్తులంతా వసంతపు వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలో వీధివీధిన తిరుగుతూ మహిళలు, పురుషులు వసంతపు నీరు, కుంకుమతో జాతర జరుపుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

నేడు కుదావన్ స్మారక సాంస్కృతికోత్సవం

క్రోసూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు షేక్ కుదావన్ 24వ వర్ధంతి సందర్భంగా సోమవారం క్రోసూరులో సాంస్కృతికోత్సవం నిర్వహించనున్నట్టు బళ్ళారి రాఘవ కళా సమితి అధ్యక్షుడు బొబ్బిళ్ళపాటి గోపాలకృష్ణ సాయి తెలిపారు. ఇందులో భాగంగా మధుర గేయాలాపన, నాటికలు, హరికథ ప్రదర్శన ఉంటుందన్నారు. క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు షేక్ కుదావన్ పేరిట జడ్పీ హైస్కూల్ ఆవరణలో 2001లో షేక్ కుదావన్ కళావేదికను నిర్మించారు. ఆయన అభిమానులు, శిష్యుల సహకారంతో ఈ సాంస్కృతికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి క్రోసూరులో వేసవి విజ్ఞాన శిబిరం

క్రోసూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి మే 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 8:30 గంటల వరకు కథలు చదివించటం, వినిపించటం, 8:30నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవటం, 10:10 గంటల నుంచి 11వరకు పుస్తక సమీక్ష, కథలు చెప్పటం, డ్రాయింగ్, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, చెస్, క్యారమ్స్ మొదలైన వాటిలో శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రక్షణ కరువు

● ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు
● రక్షణ చర్యలు ఏర్పాటులో నిర్లక్ష్యం
● ఆందోళనలో పురప్రజలు




పార్కు సెంటర్లో దుకాణాల వద్ద రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



జెండాచెట్టు బజారులో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు

మాచర్లటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు చోట్ల విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. ఎటువంటి రక్షణ లేకపోవడంతో పురప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.. ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందోనని వాపోతున్నారు. మాచర్ల పట్టణంలో నిరంతరం రద్దీగా ఉండే పార్కు సెంటర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ముందు భాగంలో తోపుడు బండ్లపై పలువురు పూల వ్యాపారం చేస్తున్నారు. వెనుక భాగాన దుకాణాలు ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్‌తో పేలిపోవడం, నిప్పురవ్వలు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వర్షాకాలంలో ఎర్త్ వస్తుండడంతో వ్యాపారులు నానా అగచాట్లు పడుతున్నారు. అలాగే పాతూరులోని జెండా చెట్టు బజారులో ఒకేచోట నాలుగు స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇవి కూడా తక్కువ ఎత్తులో ఉండడం, ఎటువంటి రక్షణ లేకపోవడంతో.. అక్కడి ప్రజలు భయకంపితులవుతున్నారు. కెనరా బ్యాంకు, పోస్టాఫీసు, ప్రభుత్వ వైద్యశాల వెనుక వైపు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సమయంలో దాని చుట్టూ చిన్నపాటి ఇనుప చువ్వలతో ఓ గేటు, ప్రహరీ, ద్వారం ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా ఆ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తును పెంచి రక్షణ ఏర్పాటు చేస్తాం.
- నూతలపాటి సింగయ్య, డీఈ, విద్యుత్ శాఖ



కెనరా బ్యాంకు ఎదురుగా రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్



పోస్టాఫీసు వద్ద రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



ప్రభుత్వ వైద్యశాల వెనుక రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మరు

ఎన్నికల హామీలను నెరవేర్చిన ప్రభుత్వం

● తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

గురజాలటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాచర్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 42 దేవస్థానాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల వేతనం ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో బోర్డు మెంబర్లుగా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సెలూన్ షాపులకు 40 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులు కూటమి ప్రభుత్వానిక అండగా ఉంటారని నాగేశ్వరరావు అన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ

దుర్గి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల గ్రామ శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

రెంటచింతల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య కోసం ఒకటో తరగతిలో 25 శాతం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు చెప్పారు. తల్లి, తండ్రి లేని అనాధ పిల్లలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వారు కూడా వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల లోపు ఉన్నవారు అర్హులన్నారు. మే 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం

● గిరిజన ప్రజా సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్‌నాయక్



ఆత్మీయ సమావేశంలో గిరిజనులు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేసేందుకు మాచర్ల నుంచే శంఖారావం పూరిస్తున్నట్లు గిరిజన ప్రజా సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడితె శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన గిరిజనుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్ల ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఇప్పటికీ గిరిజనులు స్వతంత్రంగా జీవించలేని స్థితిలో ఉన్నారన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నూన్సావత్ రంగానాయక్, జడ్పీటీసీ మండ్లి పెదమల్లుస్వామి, ఎంపీటీసీ బ్రహ్మయ్య, సర్పంచ్ నేనావత్ శ్రీను, రమావత్ మంత్రునాయక్, సైదానాయక్, అంజినాయక్, లచ్చునాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

దుర్గి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దుర్గి జిల్లా పరిషత్ హైస్కూల్ 1981 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు రూ.50వేల విలువైన బెంచీలను అందించారు. కార్యక్రమంలో తిప్పర్తి శివశంకర్, దార్ల ఈశ్వర నాగేశ్వరాచారి, ఈశ్వర్‌రెడ్డి, కాచర్ల శ్రీను, కాట్రాజ్ శ్రీనివాసరావు, జాఫ్రి, అనంతరామయ్య, బండ్ల ప్రసాద్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి తిరునాళ్ళలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు



నార్నెపాడులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ముప్పాళ్ళ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్నెపాడులో పోలేరమ్మ తల్లి తిరునాళ్ళ ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు రావిపాటి దేవేంద్రరావు, పాతూరి పెంచలయ్య తదితరులున్నారు.



వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన సత్తెనపల్లి జట్టు

వాలీబాల్ పోటీల విజేత సత్తెనపల్లి జట్టు

సత్తెనపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో జరుగుతున్న హైదరాబాద్ రీజనల్ స్థాయి అండర్ - 17 వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయం జట్టు పోటీల్లో విజయవాడ జట్టుపై విజయం సాధించి గోల్డ్‌మెడల్ సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని వాల్తేరు జట్టు కైవసం చేసుకుంది. కార్యక్రమంలో ఏపీ ఫైర్ స్టేషన్ సివిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కేంద్రియ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీ కిరణ్‌రెడ్డి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు.

తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చెన్నయ్య



నియామకపత్రం అందుకుంటున్న చెన్నయ్య

మాచర్లటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తాపీ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా గాజుల చెన్నయ్య ఎన్నికయ్యారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో ఈ ఎన్నిక జరిగింది. చెన్నయ్య వరుసగా ఏడుసార్లు పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చెన్నయ్యను సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అభినందించారు. అనంతరం చెన్నయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు, అప్పారావు, పగడాల సుధాకర్, మిద్దెపోగు బాబురావు, బత్తుల వెంకటేశ్వర్లు, బత్తిన వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటస్వామి, పుల్లారావు, ఓర్సు విజయ్‌కుమార్, ఉప్పుతోళ్ల అంజి, దుర్గారావు, మహంకాళి కొండలు, కొమెర పెద శ్రీను, మౌలాలి, మణికంఠ, నాగరాజు, ముస్తఫా, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి శ్యామరాజపురం సర్పంచ్

దుర్గి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామరాజపురం సర్పంచ్ వైసీపీకి చెందిన తాటి రామారావు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలో టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యాగంటి టీడీపీ కండువాను కప్పి రామారావును పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దుర్భాకుల ప్రసాద్, వీరు, మాగులూరి నారయ్య, మేకల దాసు, జానకి రామయ్య, సింగు నాగేశ్వరరావు, చావా రామారావు, బట్టు శ్రీను, బుజ్జి, నాగేశ్వరరావు, హనుమంతు, గౌరి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయనాయక్

మాచర్లటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సురేష్, కొమెర రమణ, పవర్‌గ్రిడ్ నాయకులు వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



వీరబాబు మృతదేహంపై పార్టీ కండువా కప్పుతున్న శ్రీధర్

వీరబాబు మృతికి కొమ్మాలపాటి సంతాపం

అమరావతి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని ధరణికోట గ్రామ ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ నాయకుడు నడకుదురు వీరబాబు మృతికి పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సంతాపం తెలియజేశారు. ఆదివారం వీరబాబు ఇంటికి వెళ్లి మృతదేహంపై పార్టీ కండువా కప్పి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేశారు. శ్రీధర్ వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో గ్రామ దేవత ముత్యాలమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల కోటిరెడ్డి నేతృత్వంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

అమరావతి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఆటస్థలంలో ఆదివారం అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ పోటీలలో ఏడు టీంలు పాల్గొంటున్నాయి. గెలుపొందిన టీంలకు మొదటి బహుమతిగా రూ40వేలు, ద్వితీయ బహుమతిగా రూ30వేలు, తృతీయ బహుమతిగా రూ20వేలు అందించనున్నారు. వీటితో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ కీపర్‌లకు బహుమతుల అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

హుస్సేన్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం

బెల్లంకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మురికిపూడి హుస్సేన్ కొద్దిరోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబసభ్యులకు మండల టీడీపీ నాయకుడు గుడిసె కొండయ్య రూ 5వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

ఏపీయూడబ్ల్యూజే నేతలు ర్యాలీ

కారంపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా ఆదివారం రాత్రి కారంపూడిలో ఏపీయూడబ్ల్యూజే నేతలు కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. బస్టాండ్ సెంటర్ గాంధీబొమ్మ, చెక్‌పోస్టు సెంటర్ మీదుగా బ్యాంకు సెంటర్ వరకు ర్యాలీ సాగింది. పాకిస్థాన్‌కు తీవ్రస్థాయిలో బుద్ధి చెప్పాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నేతలు పాల్గొన్నారు.

భిక్షాలు మృతి బాధాకరం

బెల్లంకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు సందెపోగు భిక్షాలు మృతి బాధాకరమని టీడీపీ మండల నాయకుడు గుడిసె కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామంలో భిక్షాలు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఖాళీ స్థలం.. సమస్యల నిలయం



ఇళ్ల మధ్యే ముళ్లచెట్లు..

● మినీ డంపింగ్ యార్డుల్లా ఖాళీ స్థలాలు
● మురుగు, పిచ్చి మొక్కలు, చెత్తతో అధ్వానం
● దోమల వృద్ధి, కీటకాలకు ఆవాసం
● రోగాలు తప్పవంటూ..పరిసర నివాసితుల ఆందోళన
● పన్ను వసూలులోనూ పురపాలిక అలసత్వం..

సత్తెనపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని ఖాళీ స్థలాలు స్థానిక ప్రజలను కలవర పెడుతున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పేరుకు పోవడంతో సమీప నివాసాల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై మునిసిపల్ అధికారులకు ప్రజలు పలు మార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. పట్టణంలోని 31 వార్డుల్లో ప్రతి వీధిలోనూ ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. వీటి యజమానులు పట్టించుకోకపోవడంతో అవి మినీ డంపింగ్ యార్డుల్లా తయారయ్యాయి. స్థలాలను కొనుగోలు చేసిన వారు పొరుగు రాష్ట్రాలు, దేశ విదేశాల్లో స్థిరపడడంతో వీటి ఆలనపాలన చూసే వారు కన్పించడం లేదు. పలు ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు పెరిగి ఉన్నాయి. ఫలితంగా పరిసరాల ప్రజలు దోమలు, కీటకాల బెడదతో అల్లాడుతున్నారు.

పన్ను వసూలు లోను అంతే

సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఖాళీ స్థలాలకు 0.5 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉండగా సంబంధిత మునిసిపల్ అధికారులు సక్రమంగా దృష్టి సారించడం లేదు. సత్తెనపల్లి పట్టణంలో అధికారికంగా 971 ఖాళీ స్థలాలు మాత్రమే ఉన్నాయి. అనధికారికంగా మరో ఐదు వందల వరకు ఖాళీ స్థలాలు ఉంటాయి. 971 ఖాళీ స్థలాలకు గాను రూ.34.83 లక్షల పన్ను బకాయి ఉంది. నేటి వరకు రూ 16,63,315 మాత్రమే వసూలు చేశారు. ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను వసూలులోనూ శానిటరీ, రెవెన్యూ సెక్రటరీలు, మునిసిపల్, రెవెన్యూ ఉద్యోగులు వెనుక బడ్డారు. ఏటా నిర్దేశిత లక్ష్యాలను సైతం అధికారులు వసూలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఆస్తి పన్ను వసూలుకు ఆసక్తి చూపే అధికారులు ఖాళీ స్థలాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడంలో విఫలమయ్యారు.

నోటీసులు జారీ చేస్తాం

పన్నులు చెల్లించని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. స్థలాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడానికి తగిన చర్యలు చేపడతాం.
- ఆనంద్ కుమార్, మునిసిపల్ కమిషనర్



పట్టణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో మొలచిన పిచ్చి చెట్లు

సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల నిరసన

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన 39వ రోజుకు చేరుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం, న్యాయమైన డిమాండ్ల సాధనకోసం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 39వ రోజుకు చేరుకుంది. మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం చర్చిలకు సైతం వెళ్లకుండా సమ్మె శిబిరంలోనే మోకాళ్ళపై నిలపడి ప్రత్యేక ప్రార్థన చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే చదలవాడ పరామర్శ

రొంపిచర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆదివారం పరామర్శించారు. రొంపిచర్లలో నెల్లూరి కోటేశ్వరరావు, సంతగుడిపాడులో చల్లా హనుమంతరావులు మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సేవా సంఘం సర్వసభ్య సమావేశం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లో పల్నాడు జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, నరసరావుపేట బ్రాహ్మణ సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముత్తనపల్లి శివ ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ తరఫున ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన అన్నమరాజు వేణు మాధవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు దండంరాజు హనుమంతురావు, కోశాధికారి డాక్టర్ కారంచేటి శ్రీనివాస్‌కుమార్, బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి కోనంకి మారుతితదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ తల్లి తిరునాళ్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెం లోని అంకమ్మ తల్లి తిరునాళ్ళ ఆదివారం వైభవంగా జరిగింది. 35వ వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు

వినుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విప్పర్ల చాతుర్యని జనసేన పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. చాతుర్య 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● వినుకొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గంలోని రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు వినుకొండ తహసీల్దార్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సోమవారం అర్హత కలిగిన రైతులకు యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● చిలకలూరిపేట: ప్రణాళిక ప్రకారం డీఎస్సీ చదివితే ఉద్యోగం సాధించటం సులభమని, గుంటూరు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కే.రాజ్‌కుమార్ అన్నారు. డాక్టర్ ఏ.పీ.జే అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్, జయం స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం రాత్రి డీఎస్సీ మీద ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు షేక్ జాఫర్, ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరంలోని గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 175 మందికి పరీక్షలు చేయించారు. నరసరావుపేటకు చెందిన ఎంవీ రెడ్డి ఆస్పత్రి వారు ఈ వైద్య శిబిరం నిర్వహించారు.

● చిలకలూరిపేట: సనా ముస్లిమ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, లక్కీ రోడ్ లైన్స్ అధినేత మొహమ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక పేద ముస్లిమ్ బాలుర ఖత్నా (వడుగుల) కార్యక్రమం నిర్వహించారు. 150 మంది పేద ముస్లిమ్ బాలురకు స్థానిక షాలుబుడే షాదీఖానాలో ఉచితంగా వడుగులు చేయంచారు.

● చిలకలూరిపేట: టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 13,14, 25 వార్డుల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఆయా వార్డులకు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా 13వ వార్డుకు షేక్ నాగుర్ వలి, కుంభా నాగేశ్వరరావు, 14వ వార్డుకు ఆర్శీ బాజీ, షేక్ బారి, 25వ వార్డుకు మిద్దెల పూర్ణ సింగ్, దామర్ల రవి ఎన్నికయ్యారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో ఆదివారం చిలకలూరిపేట నియోజకవర్గ కార్పెంటర్ అసోసియేషన్ సమావేశం సంఘం అధ్యక్షుడు కాళహస్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో బొప్పుడి వీరేశలింగం. చిత్రిక మిషన్‌బాబు, బీడింగ్ కరిముల్లా, టి.వెంకటనగేష్, షేక్ కరీముల్లా, సిద్దు రమేష్‌బాబు పాల్గొన్నారు.

గోకులాల బిల్లులు కోసం రైతన్నల ఎదురుచూపులు



బొల్లాపల్లి మండలంలో పూర్తయిన గోకులంను పరిశీలిసున్న అధికారులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సాయం చేస్తుందన్న నమ్మకంతో గోకులం షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో 33గ్రామ పంచాయతీలకు 23 మినీ గోకులాల షెడ్లు మంజూరయ్యాయి. షెడ్ల నిర్మాణం కూడా పూర్తయింది. మండల నాయకుల చేతుల మీదుగా ప్రారంభించి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాక పోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకొక్క గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.23 లక్షలు ఖర్చు అవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.2లక్షలు ఇస్తుండగా రూ.23వేలు లబ్ధిదారుడు కట్టాల్సి ఉంది. తీరా నిర్మాణం పూర్తయ్యాక బిల్లుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం: ఏపీవో లక్ష్మణ్

మండలంలో పూర్తయిన గోకులం షెడ్ల వివరాలను జిల్లా అధికారులకు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరుచేసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయటం జరుగుతుందని ఏపీవో లక్ష్మణ్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

తాగునీటి పథకంతో దాహార్తి తీరుస్తా

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేసి, వినుకొండ పట్టణంలో ఇంటింటికి తాగునీటి పథకాన్ని ఏర్పాటుచేసి ప్రజల దాహార్తి తీరుస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని గంగినేని కల్యాణ మండపంలో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని), జిల్లా అంధత్వ నివారణ సంస్థ (గుంటూరు), శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన జీవీ మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మన్ లీలావతి సేవా కార్యక్రమాలు విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. సెంటు భూమి, ఇల్లు లేని ఎస్టీలకు ఫౌండేషన్ సేవలం దిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఫౌండేషన్ ద్వారా 40వేల మందికి పైగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించామన్నారు. 1998లో సేవా భావంతో జన్మభూమి రుణం తీర్చుకుందామని ఈ సేవా కార్యక్రమాలను మొదలుపెట్టినట్లు తెలిపారు. అలాగే పేదరికంలో ఉండే ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్నత విద్య, సివిల్స్ గ్రూపు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కూడా శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం, ప్రోత్సాహకం అందిస్తామన్నారు. మన ప్రాంతం నుంచి ఎక్కువమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, గ్రూపు-1 అధికారులుగా దేశవ్యాప్తంగా సేవలు అందించే స్థాయికి వినుకొండ, పల్నాడు నుంచి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మిత్రులందరి సహకారంతో తాగునీటి పథకానికి నిధులు తీసుకొస్తామని తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి నీటిని ఎన్ఎస్‌పీ కాలువ నుంచి అండర్ గ్రౌండ్ పైపులైన్ వేసి కలుషితం లేకుండా మూడు చెరువులను అనుసంధానంతో పెద్దచెరువు చేసి 365 రోజులు నీళ్లు ఇచ్చేవిధంగా భవిష్యత్‌లో శాశ్వత తాగునీటి పథకం తీసుకొస్తామన్నారు. త్వరలో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఇవ్వబోతోందని, అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, పీవీ సురేష్‌బాబు, గంగినేని రాఘవ, దాసరి కోటేశ్వరరావు, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యులు, ఆర్ఎంపీ డాక్టర్, అధికారులు, కూటమి నాయకులు, శివశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగ మిత్రుల శాంతి ర్యాలీ



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వరయోగ సేవా కేంద్రం నిర్వాహకులు, యోగ సాధకులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో జరిగిన మతోన్మాద, తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఆదివారం నరసరావుపేట పట్టణంలో శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగ మిత్రుల శాంతి ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధనరావు మాట్లాడుతూ మతోన్మాదంతో 28మందిని కిరాతకంగా చంపారన్నారు. భారత ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకొని తీవ్రవాద సంస్థలను తుడిచి పెట్టడానికి గొప్ప నిర్ణయాలు చేయాలన్నారు. దీనిలో భాగంగా శాంతి పాదయాత్ర నిర్వహించామన్నారు. ఆదే విధంగా శ్రీ వెంకటేశ్వర సేవా కేంద్రం ఆధ్వర్యంలో 186వ ఉచిత యోగా శిక్షణ శిబిరం 28 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. శాంతి ర్యాలీలో మంచాల తిరుపతిరావు, సహాయ గురువులు మల్లేశ్వరి, సత్యనారాయణ, యోగ సాధకులు పాల్గొన్నారు. శాంతి ర్యాలీ పట్టాభిరామస్వామి ఆలయం నుంచి శివుడి బొమ్మ వరకు నిర్వహించారు.



రొంపిచర్లలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

● రొంపిచర్ల: మండల కేంద్ర మైన రొంపిచర్లలో పహల్గామ్ దాడిలో మృతిచెందిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వామపక్షాలు, ముస్లిం యూత్, మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

● నాదెండ్ల: భారతదేశంలో ఉన్న మత సామరస్యాన్ని బలహీనపరిచేందుకు పహల్గామ్‌లో అమాయకులపై ఉగ్ర దాడి జరిగినట్టు భారత రాజ్యాంగ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు అన్నారు. సాతులూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజెండ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో ఎస్.రవి చంద్ర ఆదివారం తెలిపారు. విద్యా హక్కు చట్ట ప్రకారం 2025-26 సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో చదివేందుకు 25శాతం సీట్లు దారిద్ర్య రేఖకు దిగువున్న ఉన్న కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్యా బోధన చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీలకు పది శాతం, షెడ్యూల్ తెగలకు నాలుగు శాతం, బలహీన వర్గాలు, మైనార్టీలకు ఆరు శాతం, విభిన్న ప్రతిభా వంతులు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు ఐదు శాతం రిజర్వేషన్‌ను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 29 నుంచి మే 15వ తేదీ లోగా ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో ఆన్‌లైన్‌లో లేక మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి శాఖా గ్రంథాలయంలో పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్ ఆదివారం తెలిపారు.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి కోసూరి వెంకటరావు ఆదివారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో గ్రంథాలయం వద్ద సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే ఈ విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిలకలూరిపేటలో తల్లి, సోదరిపై కుమారుడి అరాచకం

● దౌర్జన్యం వీడియోల హల్ చల్

చిలకలూరిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి, సోదరిలపై కుమారుడు దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన సంచలనంగా ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ఆదివారం చక్కర్లు కొడుతున్నాయి. టీడీపీలో ప్రముఖుడిగా ఉన్న యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చుండూరి ఉదయ్ కిరణ్ చిలకలూరిపేటలో స్థిరపడి రకరకాల వ్యాపారాలు చేస్తున్నాడు. చిలకలూరిపేటలోని పండరీపురంలోని ఒక అపార్ట్మెంట్ లో నివాసముంటున్నాడు. అదే అపార్ట్మెంట్‌లో వేరొక ఫ్లాట్‌లో తల్లి, సోదరి కూడా నివాసముంటున్నారు. తల్లి అరుణకుమారి, సోదరి లక్ష్మికి సంబంధించిన బంగారం, నగదు, ఇతర ఆస్తుల విషయంలో కుమారుడు ఉదయ్‌తో విబేధాలు ఉన్నాయి. తల్లి, సోదరిని తిడుతూ ఉదయ్ వారిపై దౌర్జన్యం చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. బాధితులు చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశారు. మరోవైపు కుమారుడు ఉదయ్ కూడా ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా తమను ఊరు విడిచి వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుతో సహా తప్పుడు కేసులు పెట్టడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్టు వారు ఆరోపణ చేశారు. ఉదయ్ నుంచి మాకు ప్రాణహాని ఉంది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

అర్బన్ సీఐ రమేష్ వివరణ

ఈ వ్యవహారంపై చిలకలూరిపేట అర్బన్ సీఐ పి రమేష్‌ను వివరణ అడుగగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. అయితే ఇప్పటివరకు ఈ విషయంపై తమకు రాత పూర్వకంగా ఎటువంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు. ఫిర్యాదులు ఇస్తే కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని చెప్పారు. కుటుంబ అంతర్గత వ్యవహారం కాబట్టి ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని సబ్ స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతుల వల్ల చందవరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు.

జిల్లాలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో జిల్లావ్యాప్తంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లావ్యాప్తంగా అసాంఘిక శక్తులను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, లాడ్జిలలో తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ కూడళ్ళ వద్ద వాహన తనిఖీలు కూడా నిర్వహించారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని హోటళ్లలో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు స్థానిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు హోటళ్ల వద్దకు వెళ్లి హోటళ్లలో మకాంచేసిన వారి గురించి ఆరా తీశారు. పట్టణంలోని పలు సెంటర్లలో ఆయన వాహన తనిఖీలు కూడా నిర్వహించారు.

అటవీ శాఖ అధికారుల..



తనిఖీలు నిర్వహిస్తున్న అటవి శాఖ అధికారులు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అటవీ శాఖ రేంజ్ పరిధిలోని వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట రేంజ్ లలో అక్రమ వైల్డ్ లైఫ్ ట్రేడింగ్‌పై ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి జి.కృష్ణప్రియ ఆదివారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా వినుకొండ,బొల్లాపల్లి, కారంపూడి, దుర్గి, మాచర్ల, పాపాయిపాలెం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, పాపాయిపాలెం, నకరికల్లు, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో నాకాబందీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నలుగురు రేంజ్ ఆఫీసర్లు జిల్లావ్యాప్తంగా సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రన్నతోనే సాధ్యం

● కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రప్రదేశ్): నాయీ బ్రాహ్మణుల సంక్షేమ, అభివృద్ధి సీఎం చంద్రన్నతోనే సాధ్యం అని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. ఆదివారం నరసరావుపేట పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ ఆలయాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలవారీ భృతిని రూ.25 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రూ.20వేల నుంచి రూ.25వేలకు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిందని, దేవాలయాలలోని కేశఖండనశాలలో పనిచేస్తున్న వారికి వర్తించేలా జీవో జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కూరపాటి రఘురామయ్య, పెద్ద కేశవులు, వక్కలగడ్డ విష్ణు ప్రసాదు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరులో వ్యర్థాలతో నిండిపోయిన బస్ షెల్టర్

అధ్వానంగా వెల్లటూరు బస్ షెల్టర్

బొల్లాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్ వ్యర్థాలతో నిండిపోవటంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు బస్టాండ్‌లోని వ్యర్థాలను తొలగించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

యడ్లపాడు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి



గంగయ్యచౌదరి దంపతులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్, న్యాయవాది రమణకృష్ణ

యడ్లపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఆదివారం యడ్లపాడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన విశ్రాంత దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి, భారతి దంపతుల నివాసానికి వచ్చి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ విషయాలతోపాటు పలు అంశాలపై ముచ్చటించారు. గంగయ్యచౌదరి, తాను హైదరాబాద్‌లో ఒకేచోట న్యాయవాదులుగా (జస్టిస్ కోదండరామ్ వద్ద) పనిచేశామన్నారు. న్యాయవాద వృత్తిలో జూనియర్‌గా ఉన్న తనను ఎంతగానో ప్రోత్సహించారని, గురువుగా మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఆయన వెంట హైకోర్టు న్యాయవాది రమణకృష్ణ ఉన్నారు.

బొల్లా అసత్య ప్రచారాలు మానుకోవాలి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసత్య మానుకోవాలని లేరని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. ఆదివారం చీఫ్‌విప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశమంటూ ప్రజలను నిలువునా ముంచడమే కాక తప్పుడు కేసులు బనాయించి అరాచక పాలన సాగించారన్నారు. ఎన్‌డీఏ పాలనలో తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మే 2న లక్షల కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ప్రధాని మోదీ అమరావతి వస్తున్నారన్నారు. ప్రధాని సభకు వినుకొండ, పల్నాడు వ్యాప్తంగా వేలాదిమంది హాజరుకానున్నట్లు వివరించారు. అతస్య ఆరోపణలకు పేటెంట్, కేరాఫ్ అడ్రస్‌గా వైసీపీ, జగన్ తీరు ఉందని తెలిపారు. యువతకు ఉద్యోగాలిచ్చే కంపెనీలకు తక్కువ ధరకు భూములిస్తే తప్పేంటని ప్రశ్నించారు. జగన్‌లా కమీషన్ల కోసం కాక నిరుద్యోగ యువత కోసమే చంద్రబాబు నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. గత 20 సంవత్సరాలుగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా సేవలు కొనసాగిస్తున్నామని, బొల్లా చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే నిరూపించాలని తెలిపారు. నిరుపేదల ఇళ్ల స్థలాల పేరిట రూ.14కోట్లు దోచుకున్న దొంగ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ, పల్నాడు జిల్లాలో ఫ్యాక్షన్ సంస్కృతిని తరిమివేయడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

30లోపు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

● మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెలాఖరులోపు ముందుగా చెల్లించి ఐదు శాతం రాయితీ పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ఆదివారం తెలిపారు. ఆస్తిపన్ను పాత బకాయి చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ కూడా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పన్ను చెల్లింపు కోసం మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

● 230 మందికి షుగర్, బీపీ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ, డాక్టర్ లింగముల్లు మోహన్‌భాస్కర్

యడ్లపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సాంస్కృతిక వేదిక బాసట ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత షుగర్, బీపీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య నిపుణులు డాక్టర్ లింగముల్లు మోహన్‌భాస్కర్, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజలు పాల్గొని వైద్య సేవలు అందించారు. శిబిరానికి హాజరైన 230మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రెండు నెలలకు సరిపడ మందులను అందజేశారు. కార్యక్రమాలను బాసట అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని శ్రీనివాస్, కోశాధికారి కేతా రాంబ్రహ్మం, సభ్యులు ముత్తవరపు రవీంద్ర, వేణుగోపాల్, గోనుగుంట్ల కిరణ్, రావి సురేష్‌బాబు, చిట్టిపోతు రంగారావు, రాపూరి నరేష్, కోయ రామోజీరావు, పోపూరి శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.